# పిచ్చి కుక్కలు

ఇది సుమారు పదునెనిమిదవ శతాబ్దపు ఆఖరు రోజులలో మా రు మూలవున్న మావూర్లో జరిగిన సంఘటన.

రంగయ్య రొట్టెల దుకాణం అంటే ఆ ప్రాంతంలోని అయిదారు వీధుల వారికెంతో నమ్మకంగా వుండేది. ఉదయం లేవగానే ఆవీధుల్లోవుండే రమారమీ ప్రతి వ్యక్తి రంగయ్యయింటికివచ్చి అతను ఒక్కొక్క రొట్టె కాల్చియిస్తూ వుంటే తీసుకొని వెళ్ళిపోతూవుండే వారు! రామన్న, సుబ్బయ్య, వీరభద్రం, శేషావతారం, భగవానులు, వెంకటేశం అంతా రంగయ్య దుకాణందగ్గర స్నేహితులైన వాళ్లే రంగయ్య దుకాణం దగ్గర తమవంతురొట్టె దొరికేవరకు ఏదో లోకాభిరామాయణం చెప్పకోవడం, తరువాత ఎవరిపనులమీద వారు వెళ్లిపోవడం వారినిత్య దినకృత్యం ...... వారిమాటల్లో మాత్రం గతసంవత్సరపు పండగ రోజుల్లో రాణీగారి అలంకారాల్లోని ప్రత్యేకత దగ్గరనుంచి, నిన్న ఫలానీ వాడు ఫలానీ దగ్గర తాగి తందనాలాడినవైనం వరకూ ఎన్నో భోగట్టాలిట్టే దొర్లిపోయేవి.

ఒకరోజు కాస్త పెందరాళే వచ్చినసుబ్బయ్య మరేమీవిషయం స్ఫురించక "రామన్న మావా! యీకుక్కపిల్ల వుందిచూసేవూ... నల్లకుక్కపిల్ల. రోజూ నేనురొట్టెపట్టుకొని వెళ్లిపోయేటపుడు...కూ.కూ.కూ అంటూ నావెంటచాలాదూరం వరకూ వస్తుందిసుమా.."అన్నాడు. ఇంకాఏమో చెప్పబోయే లోపలే తనవంతురొట్టె దొరకడం చేత వెంటనే వెళ్లిపోయేడతను.

మరికొంత సేపు వంటరిగా కూర్చున్న రామన్న, ఆతరువాత వచ్చిన వెంకటేశంతో, సుబ్బన్నని నల్లకుక్క కరిచేసిందని కుక్కలుచాలా ప్రమాదకరంగా విజృంభించేయని ఓ చిన్న ఉపన్యాసం దంచేసేడు.

పంతుల సావిత్రి

తరువాత ఆమాట భగవానులు, శేషావతారం, వీరభద్రం, చెవినుండి చెవికి దాటేసరికి నల్లభైరవం పిచ్చికుక్కగాను, సుబ్బయ్య రాణీగారి ఆంతరంగిక కార్యదర్శిగానూ మారిపోయేరు. అంటే రంగయ్య రొట్టెలదుకాణం దగ్గరనుంచిపట్నం నాలుగుమూలల ప్రాకిపోయిన ఆవార్త స్వరూపంయిది:- ఊళ్లో పిచ్చికుక్కల ప్రమాదం చాలా తీవ్రంగావుంది. మహారాణీ గారి ఆంతరంగిక కార్యదర్శి పిచ్చికుక్కచే కరువబడిన కారణంగా చాలా ప్రమాదస్థితిలో వున్నారు. ప్రజలందరూ 'ఆత్మరక్షణకి' తగు ఏర్పాట్లు చేసుకోవాలని కోటఅధికార్లు హెచ్చరిస్తున్నారు".

ఇక చూడండి తమాషా: యువకులంతా ముఠాలుగాచేరి పట్నవాసులను హెచ్చరించడం ఆరంభించారు. స్కూళ్లు, ఆఫీసులన్నీ వాటంతట అవే శెలవలు ప్రకటించుకున్నాయి. బజారులన్నీ సుమారుగా నిర్మానుష్యమైనాయి. ప్రతిడాక్టరు యింటిముందు "పిచ్చి కుక్కల స్పెషలిస్టు" అని కొత్తబోర్డులు వెలిసేయి. ప్రతిగోడమీద "పిచ్చికుక్కలకాటుకి రామబాణం లటి మందు" లపేర్లు రంగు రంగుల అక్షరాల్లో కనిపిస్తున్నాయి. ఒక్కమాటలో చెప్పాలంటే ఆనాటి మా గ్రామవాసుల్లో ప్రతిఒక్కడి మెదడులోనూ కనీసం ఓ వందపిచ్చికుక్కలైనా పరుగెడుతుండే వేమోననిపించిందంటే నమ్మండి! పరిస్థితులు విషమించక ముందే ధైర్యశాలులైన యువకులంతా కలసి 'ఆత్మరక్షణ' కై దళాలుగా ఏర్పడ్డారు. ప్రతినాలుగు రోడ్డుల కూడలికి ఒక్కొక్క దళంవారు సిద్ధమయేరు, కాళ్లకి ఇనుపమేజోళ్లు, చేతుల్లో బడితెలు, జేబుల్లో రాళ్లు, ఇవి యీపిచ్చికుక్కల పోరాటవీరుల "హంగులు!" వీరంతా నాలుగు పక్కలా కాచినసమయంలో ఎవరో ఒక "శూరాగ్రేసర చక్రవర్తి" అతిధైర్యంతో ముందుకిపోయి వెతికి వెతికి ఎక్కడనుంచైనా ఒకకుక్కని తరుముకొని వచ్చేవాడు. అదిగాని ముక్కుకి సూటిగాపోతే తప్పకుండా పిచ్చికుక్కే! లేక ఇటూఅటూ కలబడ్డదంటేకుక్కలపిచ్చికి ఇది ప్రధాన లక్షణం. ఎలాగైనా బడితెపూజతప్పదు. అంటే ఆరోజుతో 'కాకిగీట న్యాయంగా' ఆకుక్క యమపురి దర్శనభాగ్యం పొందితీరాల్సిందే...

కొన్నాళ్ల కీవిషయం మహారాణీగారి చెవినిపడింది. వెంటనే కోటలో ఒక గొప్పసభ ఏర్పాటు చెయ్యబడింది. పురప్రముఖులు,

(43-వ పేజీ చూడండి)

## పిచ్చి కుక్కలు

(33-వ పేజీ తరువాయి)

ఉద్యోగస్తులు, డాక్టర్లు, యువకులు అందరూ హాజరయ్యేరు. అంతవరకు పిచ్చికుక్క కాటుతిని చచ్చిపోయినట్లు, చికిత్స పొందుతున్నట్లు చెప్పబడ్డ వారందరూ తెల్లబోయి ఒకరిముఖం ఒకరు చూసుకుంటున్నారు.

ఇంతలో రాణీ గారు విషయం ఆమూలాగ్రం పరిశీలించి ఛలోక్తిగా:

"మంత్రీ! వీరిలో అమాయకమైన మూగ జంతువుల్ని అనవసరంగా చంపి పాపం చేసుకున్న వారు పాపవిమోచనార్థం వెంటనే తమ ఇంటిపేర్లు "పిచ్చికుక్కలు" అని మార్చుకోవాలనీ;

"అటుపైని కుక్క పేరువిని భయపడిపోయి యిళ్లల్లోదాగొన్న భీరువులందరికి పేరుచివర "పిచ్చి కుక్కలు" అనేబిరుదు చేర్చుకోవాలనీ...... ఆజ్ఞాపించండి" అని చెప్పి సభచాలించేరు. నాటికీ నేటికీ 'పిచ్చికుక్కలు' కథ మా వూళ్లో ఒకసామెతగానే వుంటూంది ★

## ★ ఘంటారావం ★

(25-వ పేజీ తరువాయి)

ఆనందం వెల్లివిరిసింది. ఆమె తన గదివైపు కతన్ని లాక్కురాబోయింది. కాని అతడు వినలేదు. "వొద్దు వొద్దు" అన్నాడు. "కోకిల గూటిలోకి గుడ్లగూబ రావచ్చునా?" అన్నాడు. ఆమె బలవంతపరిచింది. గది గుమ్మంవరకూ వెళ్లి అక్కడే నిలబడిపోయాడు. లోపలికి అడుగుపెట్టలేదు. ఆమె వెళ్ళి చాపపైన కూర్చుంది.

ఇద్దరూ కొంతసేపు మౌనంగా ఉండిపోయారు. అతడా అపార సౌందర్యాన్ని, ఆమె ఆ ఘోర వికృతాకారాన్ని పరిశీలిస్తూ ఉండిపోయారు. క్షణక్షణానికి ఆమె కతనిలో కొత్తకొత్త అంగవైకల్యాలు కనపడుతున్నాయి. ముడి కాళ్ళనుంచి గూని వరకూ, గూనివద్దనుంచి ఒంటికన్ను ముఖంవరకూ దృష్టి సారించి చూసింది. మనిషి ఇంత వికృతంగా ఎలా ఉండగలడని ఆశ్చర్యపడింది. అతని ముఖంలో అంతకంతకి విషాదభావం, నిస్పృహయత, దైన్యం ప్రస్ఫుటమౌతున్నాయి. చివరి కామె ఆముఖం చూడ్డాని కలవాటు పడింది.

"మీరు నన్ను వెనక్కి పిలిచారా?" అని అడిగాడు క్వాసిమోడో.

అవునన్నట్లామె తలూపింది. అది అర్థం చేసుకున్నాడు.

చెప్పలేక చెప్పలేక చెప్పాడు: "మీకు తెలియదేమో! నాకు చెవుడు."

"పాపం!" అన్నదామె జాలితో.

జాలిగా చిరునవ్వు నవ్వాడు. "నాకింక లేని వైకల్యాలేమున్న వనుకుంటున్నారు కాదూ! అవును. నేను చెవిటివాణ్ని. ఎంత అన్యాయమో చూడండి. మరి మీరెంత చక్కగా ఉన్నారు!"

ఆమె హృదయం ద్రవించింది. కాని మాట్లాడలేదు. మాట్లాడినా అతనికి వినపడదు.

క్వాసిమోడో నిట్టూర్పువిడిచి అన్నాడు: "ఈనాటివరకూ నే నెంత వికృతంగా ఉన్నానో నాకే తెలియలేదు. మీతో నన్ను పోల్చుకుంటే నా కెంతో బాధ కలుగుతోంది. మీకళ్ళకి నేనొక మృగంలా కనపడుతున్నా ననుకుంటాను. మీరో నా కళ్ళకి సూర్యకాంతిలా, తుషార బిందువులా, కోకిల పాటలా కనపడుతున్నారు. నేను మనిషినీకాను, మృగాన్నీ కాను. నాది ఒక ఆకారమని చెప్పలేను. దేవుడు నన్ను ముద్దగాపిండి కుమ్మి ఈ విధంగా చేశాడు."

అతనికి నవ్వు వచ్చింది. నవ్వు ఇంత హృదయవిదారకంగా ఉంటుందని చూసి ఆమె చకితురాలైంది.

తరవాత ఇలా చెప్పాడు. "నాకు చెవుడు. కాని మీరు సంజ్ఞలతో నాకు చెప్పండి. నాతో అలా మాట్లాడే యజమాని ఒకరున్నారు. మీ సంజ్ఞలవల్ల, పెదవుల కదలికవల్ల, మీ చూపువల్ల నేను మీ అభిప్రాయం గ్రహించగలను."

"అయితే ఇది చెప్పు" అందామె. "నువ్వు నన్నెందుకు రక్షించావు?"

ఆమె మాట్లాడుతున్నప్పుడు ఆమె ముఖంలోకి అతి జాగ్రత్తగా చూశాడు.

"తెలిసింది. మిమ్మల్ని ఎందుకు రక్షించానని అడుగుతున్నారు. ఒకనాటి రాత్రి మిమ్మల్ని ఎత్తుకుపోవాలని ప్రయత్నించిన వాణ్ని మీరు మరిచిపోయారు. ఆ మరునాడే వాడు కొరత మీదుండగా దాహంతీర్చి ఉపకారం చేశారు. ఆ సమయంలో లభించిన ఒక్క నీటిచుక్క, ఒక్క జాలిచూపు—వానికోసం నా జీవితాన్ని త్యాగంచేసినా ఋణం తీర్చుకోలేను. వాడి అపకారాన్ని మీరు మరిచిపోయారు. కాని వాడు మీ ఉపకారాన్ని ఆ జన్మాంతం మరిచిపోడు."

ఆ మాటలు వినేసరికి ఆమె కనుకొలకులలో నీరు నిలిచింది. అతని ఒక కంటిలో చివర—ఒక నీటిబిందువు నిలిచింది. కాని అది జారిపడలేదు. హృదయసంతాపాన్ని అతడు అణుచుకున్నాడు.

"ఇటువినండి. ఇక్కడ చాల ఎత్తైన గోపురాలున్నాయి. అక్కడనుంచి కిందికి పడ్డవాడెవడూ బతకడు. వెంటనే ఒళ్లు ముద్దయి చచ్చిపోతాడు. నన్ను తొలిగించుకోవాలని మీకు తోచినప్పుడు, నాతో చెప్పండి ఆమాట. అక్కడనుంచి కింద కురికేస్తాను. మీ నోటిమాట ఒక్కటి చాలు; ఒక్కచూపైనాచాలు, మీ ఆజ్ఞ వెంటనే పాలిస్తాను."

క్వాసిమోడో వెళ్ళిపోడాని కుద్యుక్తుడయ్యాడు. అతడిపట్ల ఆమెకి అపారమైన కరుణ కలిగింది. అక్కడే ఉండమని సంజ్ఞ చేసింది.

"కాదు కాదు" అన్నాడు క్వాసిమోడో. "నే నాట్టే సేపుండకూడదు. నే నుండలేను. నామీద జాలివల్లనే మీరు ముఖం పక్కకి తిప్పుకోడంలేదని నాకు తెలుసు. మీ కంటపడకుండా నేను మిమ్మల్ని నిత్యం చూస్తూ ఉండగలచోటు చూసుకుంటాను. అదే మంచిది" అంటూ జేబులోనుంచి ఒక ఈలతీసి గుమ్మంలో ఉంచాడు. "ఇది తీసుకోండి. నన్ను పిలవాలనుకున్నప్పుడు ఇది ఊదండి. ఈ ఈల నాకు వినపడుతుంది" అని చెప్పి వెళ్ళిపోయాడు.

(యింకా వుంది)